

## రైతుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం

మానకొండూర్, ఆగస్టు 30: కాళేశ్వరం నుంచి సాగునీరు అందించకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని మాజీ ఎంపీ బి వినోద్‌కుమార్ అన్నారు.. మానకొండూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్‌పై ద్వేషంతో రేవంత్‌రెడ్డి సర్కార్ రైతుల నోట్లో మట్టి కొడుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ మేయర్ రవీందర్ సింగ్, తాల్లపల్లి శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

## 'ఆరోగ్య మహిళ' సేవలను వినియోగించుకోవాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



మహిళలకు పౌష్టికాహారం అందిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

చిగురుమామిడి, ఆగస్టు 30: ప్రతి ఒక్కరూ ఆరోగ్య మహిళ సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం చిగురుమామిడి మండలంలోని చిన్నములకనూరులో శుక్రవారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళ స్థానికంగా ఉన్న ఆరోగ్య మహిళ క్లినిక్‌కు వెళ్లి యాభై రకాల ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు, రక్తహీనతకు గురి కాకుండా సమతుల ఆహారం, ఐరన్, కాల్షియం మాత్రలు తీసుకోవాలన్నారు. గర్భిణిగా ఉన్నప్పుడు నాలుగు వైద్య పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇంగ్లీష్ మీడియంతో కూడిన ప్రాథమిక విద్యను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో సంక్షేమాధికారి ఎం సరస్వతి, డీఎంహెచ్‌వో సుజాత, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, సీడీపీవో శ్రీమతి, తహసీల్దార్ రమేష్, పల్లె దవాఖానా వైద్యురాలు మాధురి, డీసీపీవో శాంత, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ సంపత్, పోషణ అభియాన్ కో ఆర్డినేటర్ నాగరాజు, డీహెచ్‌ఈడబ్ల్యూ కో-ఆర్డినేటర్ శ్రీలత పాల్గొన్నారు.

### మోడల్ స్కూల్ సందర్శన

కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూర్ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్యాంశాలు, బోధన తీరును అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ పాఠ్యాంశాల బోధనను పరిశీలించారు.అనంతరం బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. వంటగది నిర్మాణానికి స్థలం ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఈవో జనార్దన్, పంచా యతీరాజ్ ఏఈ కృష్ణమూర్తి, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సభ్యత్వ నమోదుపై బీజేపీ దృష్టి

- 4న జిల్లాలో నమోదుకు శ్రీకారం
- ప్రతి పోలింగ్ బూత్‌లో 200 మంది సభ్యులు
- స్థానిక ఎన్నికలపై దృష్టి
- క్షేత్రస్థాయికి కమలనాథులు



(కరీంనగర్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

భారతీయ జనతా పార్టీ అయిదేళ్ల తర్వాత సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతోంది. జిల్లాలో సెప్టెంబరు 4 నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రాష్ట్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఈ కార్యక్ర మాన్ని ప్రారంభించ నుండగా, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి నేతృత్వంలో నవంబరు 10 వరకు సభ్యత్వాలను స్వీకరిస్తారు. త్వరలో జరుగునున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అత్యధిక స్థానాలను గెల్చుకోవాలని బీజేపీ భావి స్తోంది. క్షేత్ర స్థాయికి పార్టీని తీసుకువెళితేనే ఇది సాధ్యమని, అందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విని యోగించు కోవాలని బీజేపీ నాయకులు నిర్ణయిం చుకున్నారు.

### 2.67 లక్షల మందిని సభ్యులుగా చేర్చుకోవాలని లక్ష్యం

జిల్లాలో 1,336 పోలింగ్ బూత్‌లు ఉండగా ప్రతి బూత్‌కు 200 మంది చొప్పున 2,67,200 మందిని సభ్యులుగా చేర్చుకోవాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకు న్నది. అన్ని సామాజిక వర్గాలకు చెందిన వృద్ధులు, విద్యావంతులు, వయోజనులు, విద్యార్థులు, మహిళలు ఉండేలా సభ్యత్వ నమోదును చేపడు తారు. క్షేత్ర స్థాయికి పార్టీని తీసుకవెళ్ల డమే కాకుండా అన్ని వర్గాల ప్రజల్లో ఉండేలా ఈ సభ్యత్వ నమోదును డిజైన్ చేస్తున్నారు. సభ్యత్వ నమోదు తర్వాత బూత్ స్థాయి కమిటీలను మండల స్థాయి కమిటీలను జిల్లా కమిటీని శక్తి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. అన్ని స్థాయిల్లో చురుకైన నాయకత్వం ఉండేలా చూసి పార్టీ కార్యక్రమాలను చేపట్టాలని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా నిత్యం పార్టీ ప్రజల్లో ఉండేలా చూడాలని నాయకత్వం భావిస్తున్నది.

### గ్రామీణ ప్రాంతాల్లో పట్టు పెంచుకునేందుకు..

పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లోనూ బీజేపీ అధిక్యాన్ని చాటుకుంది. అదే స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఓట్లను సాధించి ప్రతినిధులను గెలిపించుకోవాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రత్యేక కార్యాచరణతో పార్టీ యంత్రాంగాన్ని సభ్యత్వ నమోదులో ముందుకు నడిపిస్తారు. పట్టణ ప్రాంతాల్లో ఇప్పటికే పటిష్టమైన ఓటు బ్యాంకు బీజేపీకి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లోనూ పట్టు సాధించే లక్ష్యంతోనే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముందుకు తీసుకు వెళ్లను న్నారని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఐదేళ్ల తర్వాత జరిగే సభ్య త్వ నమోదు కార్య క్రమం ఆపార్టీ విజయానికి ఎంత వరకు దోహద పడు తుందో చూడాల్సిందే.

## జిల్లాలో క్రీడల అభివృద్ధికి రూ. 25 లక్షల నిధులు

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 30: జిల్లాలో క్రీడల అభివృద్ధికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతిపాదించిన పనులకు 25 లక్షల నిధులు గురువారం విడుదలయ్యాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ కింద 25 లక్షల రూపాయల అంచనా వ్యయంతో ఐదు పనులను ప్రతిపాదించారు. కరీంనగర్ రీజినల్ స్పోర్ట్స్ స్కూల్‌లో స్విమ్మింగ్ పూల్ మరమ్మతులకు ఐదు లక్షలు, జిమ్ పరికరాల ఏర్పాటుకు ఐదు లక్షలు, రీజినల్ స్పోర్ట్స్ స్కూల్ హాస్టల్ బిల్డింగ్‌కు ఐదు లక్షలు, తరగతి గదులు, ఫర్నిచర్‌కు ఐదు లక్షలు, వసతి గృహాలకు ఫర్నిచర్ అందించేందుకు ఐదు లక్షల రూపాయల వంతున నిధులను విడుదల చేశారు. ఈ పనులను జిల్లా ఇన్‌చార్జిమంత్రి, నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆమోదించారు. ఈ మేరకు కలెక్టర్ పమేలా సత్పతి 25 లక్షల రూపాయలు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## నగునూర్ గురుకుల కళాశాల తనిఖీ



విద్యాబోధనను పరిశీలిస్తున్న అలివేలు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 30: మండంలోని నగునూర్ సాంఘీక గురుకుల కళాశాలను శుక్రవారం గురుకుల విద్యాసంస్థల మల్టీజోన్-1 ఆఫీసర్ అలివేలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణం, తరగతి గదులు, విశ్రాంతి గదులు, వంటశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యారినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, గురుకులాల్లో కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసు కోవాలని విద్యార్థినులకు సూచిం చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి మాలతి, వైస్ ప్రిన్సిపాల్ జి సమత, అధ్యాపకులు డి శ్రీహరి, పద్మజ, ఆఫీస్ సూపరింటెండెంట్ టి సురేష్‌కుమార్, వెంకటేశ్వర్‌రావు, శంకరయ్య పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు

- 1 నుంచి అమల్లోకి
- నిబంధనలు ఉల్లంఘించేవారిపై చర్యలు
- సీపీ అభిషేక్ మొహంతి



కరీంనగర్ క్రైం, ఆగస్టు 30: కరీంనగర్ పరిధిలో భారీ వాహనాల రాకపోకలపై పరిమితులు, ఆంక్షలు విధిస్తూ సీపీ అభిషేక్ మొహంతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆంక్షలు సెప్టెంబరు 1 నుంచి అమలులోల్లో వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గూడ్స్, ఇతర భారీ వాహనాలు ట్రాఫిక్‌కు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయన్నారు. కరీంనగర్‌లో సాధారణ ట్రాఫిక్ సమయాల్లో వాహనాల, పాదచారుల రాకపోకలు చాలా ఎక్కువగా ఉంటాయని, అందువల్ల ప్రజల భద్రత, సౌలభ్యం దృష్ట్యా భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని రహదారుల్లో ట్రాఫిక్ రద్దీ, భారీ వాహనాల నిలపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని గతంలోనే రెగ్యులేటరీ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, ప్రజల భద్రత, ట్రాఫిక్ నిర్వహణ దృష్ట్యా కొన్ని పరిమితులు విధించామని తెలిపారు.

- ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల మధ్య వ్యాన్‌లు, వాటర్ ట్యాంకర్లు, ఆర్ఎంసీలు, లారీలు, ఎక్స్‌కావేటర్లు, ట్రాక్టర్లు, భారీ మోటార్ వాహనాలు, మీడియం మోటారు వాహనాలకు పరిమితులు విధించామన్నారు.

### కరీంనగర్ వన్ టౌన్, కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో..

**అనుమతిలేని మార్గం:**
- బద్దం ఎల్లారెడ్డి విగ్రహం నుంచి నగరంలోపలికి..
- కేబుల్ వంతెన నుంచి పట్టణం లోపలికి..

**అనుమతించిన మార్గం:**
- బద్దం ఎల్లారెడ్డి విగ్రహం నుంచి కేబుల్ వంతెన, బొమ్మకల్ ఫ్లైఓవర్ వైపు..
- ఎన్టీఆర్ విగ్రహం నుంచి సిరిసిల్ల బైపాస్ రోడ్డు మీదుగా పద్మనగర్ వరకు...

### కరీంనగర్ టూ టౌన్ పరిధిలో..

**అనుమతిలేని మార్గం:**
- పద్మానగర్ జంక్షన్ నుంచి నగరం లోపలికి..
- శాతవాహన విశ్వవిద్యాలయం నుంచి నగరం లోపలికి..

**అనుమతించిన మార్గం:**
- పద్మానగర్ నుంచి సిరిసిల్ల బైపాస్ రోడ్డు మీదుగా ఎన్టీఆర్ విగ్రహం వరకు..
- శాతవాహన విశ్వవిద్యాలయం నుంచి రేకుర్తి వైపు..

### కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో

**అనుమతిలేని మార్గం:**
- బొమ్మకల్ ఫ్లైఓవర్ నుంచి నగరం లోపలికి..
- అపోలో రీచ్ హాస్పిటల్ నుంచి నగరం లోపలికి..

**అనుమతించిన మార్గం:**
- బొమ్మకల్ ఫ్లైఓవర్ నుంచి బద్దం ఎల్లారెడ్డి విగ్రహం వరకు (హైదరాబాద్ రోడ్)
- తీగలగుట్టపల్లి నుంచి గోపాల్‌పూర్ వరకు..

### కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో

**అనుమతిలేని మార్గం:**
- రేకుర్తి నుంచి నగరం లోపలికి..



**అనుమతించిన మార్గం:**
- రేకుర్తి నుంచి శాతవాహన యూనివర్సిటీ బైపాస్ రోడ్డు వరకు.

### మినహాయింపులు:

అత్యవసర సర్వీస్ వాహనాలు అంటే, పెట్రోల్, డీజిల్, మిల్క్ వ్యాన్‌లు, నిత్యావసర వస్తువుల వాహనాలు, మున్సిపల్ పారిశుధ్య సంబంధిత వాహనాలు, పాఠశాల/కాలేజీ బస్సులరే పరిమితులు లేవు..

### బస్సులకు..

టీజీఎస్ ఆర్టీసీ ద్వారా నిర్వహించే బస్సులు మినహా ఇతర బస్సులను కరీంనగర్ పరిధిలో ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అనుమతించరు. (రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు అనుమతిస్తారు).

- నిషేధిత వాహనాలు, నిషిద్ధ ప్రాంతాల్లో తప్పనిసరి పరిస్థితుల్లో తిరగవలసి వస్తే ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయం నుంచి స్పష్టమైన అనుమతిని పొందవలసి ఉంటుంది. ఈ పరిమితులను ఉల్లంఘించే వాహనాలపై హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్, మోటార్ వెహికిల్ చట్టం, ఇతర చట్టాల సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు చేపడతామని సీపీ అభిషేక్ మొహంతి తెలిపారు.

## నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

సుభాష్‌నగర్, ఆగస్టు 30: ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా నల్ల బ్యాడ్జీలు ధరించి చేపట్టే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేఏసీ చైర్మెన్, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమం లో ఆయన మాట్లాడారు. ఈ నిరసన కార్యక్రమానికి ఉద్యోగులందరూ తప్పకుండా హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, మాజీ కార్యదర్శి ఎంఏ హమీద్, సర్దార్ హర్మింద ర్‌సింగ్, మారుపాక రాజేశ్‌భరద్వాజ్, ప్రభాకర్ రెడ్డి, మోసం అంజయ్య, లింగయ్య, పోలు కిషన్, రవీందర్‌రెడ్డి, మల్కా రాజేశ్వర్ రావు, ఆరసవెల్లి రాజేశ్వర్‌రావు, కరుణాకర్, జలాలుద్దీన్‌అక్బర్, లవకుమార్, కొండయ్య, మహేందర్‌రెడ్డి, నగేశ్, శ్రీనివాస్‌రావు, నరసయ్య, వెంకటేష్, రేవంత్, జీవన్ పాల్గొన్నారు.

- కరీంనగర్ టౌన్: నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలనే డిమాండ్‌తో సెప్టెంబరు 1న పెన్షన్ వి ద్రోహ దినం సందర్భంగా జిల్లా కేంద్రంలో చేపట్టిన భారీ నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్య దర్శి తూముల తిరుపతి ఒక ప్రకటనలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఉద్యోగుల గెజిటెడ్ అధికారుల ఉపాధ్యాయుల, పెన్షనర్ల, వర్కర్ల జాయింట్ యాక్షన్ కమిటీ, రాష్ట్ర సీరింగ్ కమిటి పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట ఉదయం 10 గంటలకు భారీ నిర సన ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి పాల్గొనాలని కోరారు.

## కేజీబీవీల్లో ముగిసిన 'వాయిస్ ఫర్ గర్ల్స్'

కరీంనగర్ టౌన్, ఆగస్టు 30: జిల్లాలోని అన్ని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో కలెక్టర్ చొరవతో వాయిస్ ఫర్ గర్ల్స్ కార్యక్రమాన్ని నిర్వహించామని జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు తెలిపారు. కరీంనగర్‌లోని కస్తూర్బా గాంధి బాలికల విద్యాలయంలో వాయిస్ ఫర్ గర్ల్స్ మొదటి విడుత పరిచయ్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ 6 నుంచి 9 తరగతుల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందిం చిన కార్యక్రమంలో పలు అంశాలపై విద్యార్థులకు అవగా హన కల్పించామన్నారు. శుక్రవారంతో ఈ కార్యక్రమం ముగిసిందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, జీసీడీవో కృపారాణి పాల్గొన్నారు.



## నర్సింగ్ స్కూల్‌లో కనీస సౌకర్యాలు కరువు

- సమస్యలతో సతమతమవుతున్న విద్యార్థినులు

సుభాష్‌నగర్, ఆగస్టు 30: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ స్కూల్ సమస్యలతో సతమతమవుతోంది. ప్రసుత్త మంత్రి పొన్నం ప్రభాకర్ ఎంపీగా ఉన్నప్పుడు ఈ నర్సింగ్ స్కూల్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్కూల్‌తోపాటు జగిత్యాలలో నర్సింగ్ కళాశాల, కొన్నాళ్లకు సిరిసిల్లలో నర్సింగ్ స్కూల్ ఏర్పాటు చేశారు. జగిత్యాల, సిరిసిల్లలో పక్కా భవనాలు నిర్మించి పూర్తి స్థాయి ఫ్యాకల్టీని నియమించారు. కరీంనగర్ నర్సింగ్ స్కూల్‌ను పట్టించుకోవడం లేదు. దీంతో సేవ చేయాలనే ఆశయంతో నర్సింగ్ స్కూల్‌లో చేరిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నర్సింగ్ స్కూల్‌లో ప్రస్తుతం 120 మంది విద్యార్థినులు చదువుతున్నారు. స్కూల్‌లో రెగ్యులర్ ఫ్యాకల్టీ లేదు. విద్యార్థినులకు సరిపడా మరుగుదొడ్లు లేవు. కనీసం తాగడానికి ఆ నీరు ఉండడం లేదని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్యం అధ్వానంగా మారింది. హాస్టల్ గదులు సరిపోక నర్సింగ్ సిబ్బందికి కేటాయించిన ఫ్యామిలీ పోర్షన్లలో ఉంటున్నారు. పూర్తి స్థాయిలో సిబ్బంది లేరు. బట్టలు శుభ్రం చేసుకునేందుకు వాష్ ఏరియా కూడా లేదు. డ్రైనేజీ సరిగా లేకపోవడంతో తీవ్ర దుర్గంధం వస్తుంది. సమస్యలు పరిష్కరించాలని నర్సింగ్ విద్యార్థినులు కోరుతున్నారు.



ప్రభుత్వ నర్సింగ్ స్కూలు భవనం

## ఇల్లందకుంట ఎస్ఐపై ఏసీపీకి ఫిర్యాదు

హుజూరాబాద్, ఆగస్టు 30: ఇల్లందకుంట ఎస్ఐ రాజ్‌కుమార్ అకారణంగా దూషించారని, మహిళా కానిస్టేబుల్‌తో కొట్టించారని. తనకు న్యాయం చేయాలని బాధితురాలు పైడిపల్లి స్వప్న శుక్రవారం ఏసీపీ శ్రీనివాస్‌జికి ఫిర్యాదు చేశారు.ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామానికి చెందిన తనను ఏడాదిన్నర క్రితం కట్కూరి నాగరాజు అత్యాచార యత్నానికి పాల్పడగా కేసు నమోదు అయిందన్నారు. అది మనసులో పెట్టుకొని తరుచూ నాగరాజు, అతని భార్య సూటిపోటీ మాటలు అనడంతో వారం రోజుల క్రితం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ తననే బూతులు తిట్టారని, అంతేకాకుండా మహిళా పోలీసులతో కొట్టించారన్నారు. తన కు న్యాయం చేయాలని ఏసీపీని కోరగా జమ్మికుంటరూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐని కలువాలని సూచించినట్లు తెలిపారు. ఎస్ఐపై సీపీకి కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

## రేపు ఉమ్మడి జిల్లా బాలికల రోడ్ సైక్లింగ్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 30: జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి బాలికల రోడ్ సైక్లింగ్ జట్టు ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. నగరంలోని శాతవాహన యూనివర్సిటీ ప్రాంగణంలో ఉదయం 7గంటల నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మెన్, అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనిటాట్స్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎంపిక పోటీల్లో అండర్-14, 16, 18, 23 అపై వయస్సు విభాగాలలో బాలికలకు పోటీలను నిర్వహించనున్నామని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను సెప్టెంబరు 14,15 తేదీల్లో నిజామాబాద్‌లో నిర్వహించే ప్రాంతీయ స్థాయి ఖేలో ఇండియా పోటీలకు, జనగామలో నిర్వహించే రాష్ట్ర స్థాయి రోడ్ సైక్లింగ్ పోటీలకు ఎంపిక చేయనున్నామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనుటకు ఆసక్తిగల క్రీడాకారులు ఈ నెల 31 సాయంత్రం లోపు 9398230614 నంబరులో సంప్రదించాలని కోరారు. పాల్గొనే క్రీడాకారులు తమ స్వంత సైకిల్‌తో హాజరు కావాలని సూచించారు.

## రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఆగస్టు 30: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,550 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు ఎనిమిది మంది రైతులు 79క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,550, కనిష్ఠ ధర 7,350 రూపాయలు చెల్లించి కొనుగోలు చేశారు.

## డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఆగస్టు 30: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురు వాహనదారులకు జైలు శిక్ష, జరిమానా పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లా ఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీలలో పట్టుబడిన 25 మంది వాహనదారులను శుక్రవారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా ఒక వ్యక్తికి 10 రోజులు జైలుశిక్ష, ఇద్దరు వ్యక్తులకు 3 రోజుల జైలుశిక్ష, మొత్తం 6,500 రూపాయలు జరిమానా విధించారని సీఐ తెలిపారు. మిగతా 22 మంది వాహనదారులకు 35 వేల రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపకూడదని హెచ్చరించారు.

## ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

| ప్రాజెక్టు | ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో) | పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో) | ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో) |
|---|---|---|---|---|
| శ్రీరాంసాగర్ | 8,500 | 5,555 | 80.5 | 60.118 |
| ఎల్లంపల్లి | 11,291 | 6,616 | 20.175 | 16.766 |
| మిడ్ మానేరు | 9,400 | 21,000 | 27.54 | 16.40 |
| ఎల్ఎండీ | 14.850 | 250 | 24.034 | 12.107 |

## సీఎంను కలిసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**- ఆశీర్వచనం అందించిన రాజన్న ఆలయ అర్చకులు**

**- శృంగేరి పీఠాధిపతులను కలిసేందుకు ప్రతిపాదనలు**



సీఎం రేవంత్‌రెడ్డికి ఆశీర్వచనం అందిస్తున్న రాజన్న ఆలయ అర్చకులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 30: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయానికి రూ. 50 కోట్ల నిధులు బడ్జెట్‌లో పెట్టడంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయానికి నిధులు కేటాయించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాజన్న ఆలయ అర్చకులు నమిలికొండ ఉమేష్, సురేష్, చందు సీఎం రేవంత్‌రెడ్డికి ఆశీర్వచనం అందించారు. రాజన్న ఆలయ విస్తరణ కోసం శృంగేరి పీఠాధిపతులను కలివాల్సి ఉందని సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే అనుమతులు తీసుకుని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించినట్లు తెలిసింది. వారం రోజుల్లో శృంగేరి పీఠాధిపతులను కలిసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కాగా త్వరలోనే రాజన్న ఆలయాన్ని దేవాదాయశాఖ కమిషనర్‌తో పాటు ప్రభుత్వ కార్యదర్శిలు సందర్శించనున్నట్లు చెప్పారు. సీఎంను కలిసిన వారిలో ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, దేవాదాయశాఖ స్థపతి వల్లియాగం, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

## పలువురికి జరిమానాలు



జరిమానా రశీదు అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 30: సిరిసిల్ల పట్టణంలోని పుర వీధుల్లో చెత్తను విచ్చల విడిగా పడవేస్తున్న అపరిశుభ్రం చేస్తున్న దుకాణ యజమానులను శుక్రవారం మున్సిపల్ పారిశుధ్య విభాగం అధికారులు గుర్తించి జరిమానాలను విధించారు. ఒక్కక్కరికి రూ. 500ల నుంచి రూ. 1000 వరకు జరిమానాలు విధించి దుకాణం యజమానులకు జరిమానా రసీద్‌లను మున్సిపల్ పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది అందజేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే భారీ జరిమానాలు విధిస్తామని దుకాణ యజమానులను హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఉమర్, శేఖర్, దేవయ్య, రాజు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవితకు నవోదయం



నవోదయ విద్యాలయం

**విద్యతో పాటు నైతిక విలువలకు పెద్ద పీట వేసి విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తున్న నవోదయ విద్యాలయాలు నవశకానికి నాంది పలుకుతున్నాయి. ప్రతిభ ఉన్నా చదువు కోలేని గ్రామీణ విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపుతోంది జవహర్ నవోదయ విద్యాలయం.**

» గ్రామీణ ప్రాంతాల వారికి ప్రాధాన్యం » ఉన్నత ప్రమాణాలతో కూడిన బోధన

» దరఖాస్తులకు నోటిఫికేషన్ విడుదల » సెప్టెంబరు 16 తుది గడువు

చొప్పదండి, ఆగస్టు 30: ఉత్తమ విలువలు, ఉన్నత ప్రమాణాలు, దేశ భక్తి, నైపుణ్యం, క్రీడలలో భాగస్వామ్యం, చదువుతోపాటు సమాజ సేవ ఇవన్నీ నవోదయ విద్యాలయంలోనే సాధ్యం. క్రమశిక్షణకు పెట్టింది పేరైన జవహర్ నవోదయ విద్యా లయంలో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆరు నుంచి 12 వ తరగతి వరకు పూర్తి గా రెసిడెన్షియల్ పద్ధతిలో ఉచిత విద్యను అందిస్తారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశ పరీక్ష కోసం నవోదయ విద్యాలయ సమితి దేశవ్యాప్తంగా నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.




అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్

**- సీబీఎస్ఈ సిలబస్..**

విద్యాలయంలో ఆరో తరగతి నుంచి కంప్యూటర్ విద్యను ప్రత్యేకంగా బోధిస్తారు. సీబీఎస్ఈ సిలబస్‌లో విద్యాబోధన, ఆధునా తనమైన సైన్స్ లైబ్రరీ, డిజిటల్ తరగతి గదులు, జిమ్ హాల్, క్రీడా మైదానం కలిగి ఉండడం విద్యాలయం ప్రత్యేకతలు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు తప్పనిసరిగా క్రీడల్లో పాల్గొనాలి. మొక్కలను నాటి వాటి సంరక్షణ విద్యార్థులు చూసుకోవాలి. విద్యార్థులపై ఎలాంటి ఖర్చు లేకుండా పూర్తిగా రెసిడెన్షియల్ పద్ధతిలో బోధనను అందిస్తున్నారు. విజ్ఞాన జ్యోతి పథకంలో భాగంగా 9 నుంచి 12వ తరగతి బాలికలకు నీట్, ఐఐటీ కోచింగ్ కోసం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను అందిస్తోంది.

**- 80 సీట్లకు గానూ..**

విద్యాలయంలో ఆరో తరగతిలో ఉన్న 80 సీట్లు గాను ఉమ్మడి జిల్లా విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. 14బ్లాక్‌ల వారీగా దర ఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. విద్యార్థులు ఆన్‌లైన్ లోనే తమ దరఖాస్తులు చేసుకోవాలి. సెప్టెంబరు 16 తేదీని దరఖా స్తులకు చివరి తేదీగా ప్రకటించారు. 2025 జనవరి 18న ప్రవేశ పరీక్షను జాతీయస్థాయిలో సీబీఎస్ఈ నిర్వహిస్తున్నది. ప్రవేశపరీక్ష కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు తొమ్మిది వేల దరఖాస్తులు రాగా జాతీయస్థాయిలో మూడో స్థానంలో నిలిచి విద్యాలయం అవార్డును దక్కించుకుంది.

**- గ్రామీణ విద్యార్థులకు 75శాతం..**

విద్యాలయంలో 80 సీట్లకు గాను75 శాతం మేరకు 60 సీట్లను గ్రామీణ విద్యార్థులకు కేటాయిస్తారు. మిగిలిన 20 సీట్లను పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తారు. మొత్తం సీట్లలో 15 శాతం ఎస్సీల కు, 7.5 శాతం ఎస్టిలకు, మూడు శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయిస్తారు. మొత్తం సీట్లలో మూడింట ఒక వంతు సీట్లను బాలికలకు రిజర్వ్ చేస్తారు. ప్రవేశ పరీక్ష మార్కులు, మెరిట్, క్యాటగిరి ఆధారంగా సీబీఎస్సీఈ ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేస్తుంది.

**అర్హులు దరఖాస్తు చేసుకునేలా..**



అర్హులైన ప్రతి విద్యార్థి నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తున్నాం. విద్యార్థుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుంది. దళారుల మాటలు నమ్మి మోస పోవద్దు. విద్యార్థులు కష్టపడి చదివితే సీటు సాధించవచ్చు. ఈ ఏడాది అత్యధికంగా దరఖాస్తులు వచ్చేందుకు కృషి చేస్తున్నాం. ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తాం.

- మంగతాయారు, ప్రిన్సిపాల్

**ప్రవేశ పరీక్షకు అర్హతలు..**

ప్రవేశ పరీక్ష కోసం విద్యార్థులు మూడు నుంచి ఐదో తరగతి వరకు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలి. ఐదో తరగతి తప్పనిసరిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చదవాలి. విద్యార్థి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వారై ఉండాలి. 2013 మే1 నుంచి 2015 జూలై 31 లోపు జన్మించిన వారే దరఖాస్తులకు అర్హులు. విద్యార్థికి ఆధార్‌కార్డు తప్పనిసరిగా ఉండాలి. లేనట్లయితే తహసీల్దార్ కార్యాలయం నుంచి నివాస ధ్రువీకరణ పత్రం పొందాల్సి ఉంటుంది. కాగా విద్యార్థులు దరఖాస్తు చేసుకునే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యార్థి తన బ్లాక్ ఎంచుకొని వెబ్‌సైట్‌లో పొందుపరచాలి. విద్యార్థులు తప్పని సరిగా గ్రామాలకు చెందిన వారే ఉండాలి. చొప్పదండి, కొత్తపల్లి, హుజూరాబాద్, పెద్దపల్లి, మంథని. సుల్తానాబాద్, రాయికల్, ధర్మపురి, మెట్‌పల్లి, జగి త్యాల, కోరుట్ల, సిరిసిల్ల, వేములవాడ మున్సిపా లిటీలుగా మారగా ఇక్కడ నివసించే విద్యార్థులు అర్బన్ క్యాటగిరి కిందికి వస్తారు. ఈ ప్రాంత విద్యార్థులు అర్బన్ కోటా కిందనే దరఖాస్తు చేసుకోవాలి.

# భారీ వర్షం

**●పొంగిపొర్లిన వాగులు ●లోతట్టుప్రాంతాలు జలమయం**

జగిత్యాల అర్బన్/జగిత్యాలరూరల్, ఆగస్టు 30 : జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి సగటున 40 మి.మీ వర్షం కురిసింది. అత్యధికంగా మేడిపల్లిలో 86.1 మిల్లీ మీటర్లు, జగిత్యాలలో 84.6, జగిత్యాల రూరల్‌లో 74.4, మల్యాలలో 73.3, రాయికల్ మండలంలో 65.5, మల్లాపూర్ మండలంలో 55.8, పెగడపల్లిలో 42.2, కొడిమ్యాలలో 41.8, మెట్‌పల్లిలో 36.6, కథలాపూర్‌లో 34.2, సారంగాపూర్ మండలంలో 34.2, ఇబ్రహీంపట్నంలో 20మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జగిత్యాల పట్టణంతోపాటుగా, పరిసర ప్రాంత గ్రామాల్లో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జగిత్యాల జలమయంగా మారింది. వాగులు, లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా వర్షంనీరు చేరుకోవడంతో లోతట్టు ప్రాంతాల్లోకి, కాలనీల్లోని ఇండ్లలోకి వర్షం నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని గోవిందుపల్లి వాగు, మోతె వాగు ఉప్పొంగి ప్రవహించాయి. దీంతో గోవిందుపల్లి అవతలివైపు ఉన్న వెంకటాద్రినగర్‌కు సంబంధాలు తెగిపోయాయి. మోతె వాగు పొంగి పొర్లడంతో గొల్లపల్లి నుంచి జగిత్యాలకు రహదారి రాకపోకలు నిలిచిపోయాయి. నీరు వాగుపైకి భారీగా ప్రవహించడంతో ప్రయాణికులు ఇతర దారి గుండా రాకపోకలు సాగించారు. వెంకటాద్రినగర్ కాలనీకి అత్యవసరం ఉన్నవారిని జేసీబీ సహాయంతో వాగు దాటించారు. సుమారు 500ల కుటుం బాల వరకు వాగు అవత లివైపు నివసిస్తుండగా భారీ వర్షం పడినప్పుడల్లా ఇదే పరిస్థితి నెలకొంటుందని ఇప్పటికైనా వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న మోతె వాగు



చల్‌గల్ వద్ద బ్రిడ్జిపై నుంచి పారుతున్న వరద నీరు

## బేసిక్ పే అమలు చేయాలి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 30: విద్యాశాఖ సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేసే వరకు బేసిక్ పే విధానం అమలు చేయాలని కోరుతూ జిల్లా సమగ్ర శిక్ష జేఏసీ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని స్థానిక ఎంఆర్‌సీ భవనం నుంచి, కొత్త బస్టాండ్ మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023లో సమ్మె చేస్తున్న సమయంలో అప్పటి టీపీసీసీ ప్రెసిడెంట్ నేటి రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి రెగ్యులర్ చేయడంతో పాటు, అప్పటి వరకు బేసిక్ పే ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు.



నిరసన తెలుపుతున్న సమగ్ర ఉద్యోగులు

# క్రైం వార్తలు

## అనుమతులు లేకుండా డీజేలు నడిపిస్తే చర్యలు

**- నిబంధనలు అతిక్రమించిన ముగ్గురు డీజే నిర్వాహకుల అరెస్ట్**

**- సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి**

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 30: ఎలాంటి అనుమతులు లేకుండా డీజేలు నడిపిస్తే కఠిన చర్యలు తప్పవని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని పోలీస్ సబ్ డివిజనల్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నిబంధలనకు విరుద్ధంగా డీజేలు నడుపుతూ పోలీసు విధులకు ఆటంకం కలిగిస్తూ ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. పోలీస్ విధులకు ఆటంకం కలిగిస్తే, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. సిరిసిల్ల పట్టణం పెద్దూరులో గల డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద నిబంధలనకు విరుద్ధంగా డీజేను రోడ్డుకు అడ్డంగా పెట్టుకొని ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని డయల్ 100కు సమాచారం రావడంతో వెంటనే బ్లూకోల్ట్స్ సిబ్బంది వెళ్లి ఆపమని చెప్పినా ఆపకుండా విధులకు ఆటంకం కల్పించిన దొంతరవేణి నవీన్, దొంతరవేని మల్లేశ్, దొంతరవేణి రంజిత్‌పై కేసు నమోదు చేశామన్నారు. ఈ ముగ్గురిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని వివరించారు.

## బైండోవర్ అతిక్రమించిన వారికి జరిమానా

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 30: బైండోవర్ నిబంధనలు అతిక్రమించిన ముగ్గురికి గురువారం జరిమానా విధించి, మరొకరికి వారెంట్ జారీచేశామని సిరిసిల్ల టౌన్ సీఐ కె కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన లింగంపల్లి అనిల్(28) అనే యువకుడు మానేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేయడంతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఈ బైండోవర్‌ను అతిక్రమించి మళ్లీ ఇసుకను అక్రమ రవాణా చేసినందున అతనిపై కేసు నమోదుచేసి తహసీల్దార్ ఎదుట హాజరు పరచగా రూ. 15వేల జరిమానా విధించారన్నారు. సిరిసిల్ల పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన బల్వీర్‌సింగ్ (42), చంద్రంపేటకు చెందిన సంపంగి మల్లవ్వ(53) బెల్ట్‌షాప్ నిర్వహించడంతో బైండోవర్ చేశామన్నారు. బైండోవర్ అతిక్రమించి మళ్లీ అదే షాప్ నిర్వహించడంతో ఒక్కొక్కరికి తహసీల్దార్ రూ. 20వేల జరిమానా విధించారన్నారు. సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన తుమ్మల శివకుమార్(21) అనే యువకుడు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించడంతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. మళ్లీ అదేవిధంగా చేసినందుకు అతనికి వారెంట్ జారీచేశారని టౌన్ సీఐ తెలిపారు. బైండోవర్‌ను ఎవరూ అతిక్రమించినా చర్యలు తప్పవన్నారు. చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించకూడదని, జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు.

## బైండోవర్లను అతిక్రమిస్తే కఠిన చర్యలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 30: బైండోవర్లను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్, అక్కపల్లి గ్రామాల్లో గతంలో పలు నేరాలకు పాల్పడడంతో ముగ్గురు వ్యక్తులను తహసీల్దార్ రామచంద్రం ఎదుట శుక్రవారం హాజరు పర్చడంతో జరిమానా విధించారని పేర్కొన్నారు. రాచర్లబొప్పాపూర్, అక్కపల్లి గ్రామాల్లోని అనరాశి కిష్టయ్య దొంగిలించిన ఇనుప సామగ్రి కొనుగోలు చేయడం, మద్యం అనుబంధ దుకాణాలను నిర్వహిస్తున్న బొమ్మనవేణి పర్శరాములు, మందాటి సతీష్‌ను గతంలో బైండోవర్ చేశామని చెప్పారు. బైండోవర్లను అతిక్రమించడంతో తహసీల్దార్ ఎదుట హాజరు పర్చగా కిష్టయ్యకు రూ.25 వేలు, బొమ్మనవేణి పర్శరాములుకు రూ.25 వేలు, మందాటి సతీష్‌లకు రూ.10 వేలు జరిమానా విధించారని వివరించారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే బైండోవర్ చేస్తామని పేర్కొన్నారు. అతిక్రమిస్తే జరిమానాలు విధించడంతో పాటు జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని సీఐ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు.

# భూ వివాదం కేసులో ఆరుగురి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 30: తప్పుడు రిజిస్ట్రేషన్‌ద్వారా నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి, భూ వివాదాన్ని సృష్టించిన 21 మందిపై కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆరుగురు నిందితులు చిట్టుమల్ల శ్రీనివాస్, చిట్టుమల్ల అచ్యుత్ చైతన్య, గంప నాగరాజు, దేశబోయిన శ్రీకాంత్, దేశబోయిన గోపాల్, దేశబోయిన శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కరీంనగర్ రెండో ఠాణా సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్‌కు చెందిన నీరుమల్ల శ్యాంసుందర్ మానకొండూర్ పరిధిలోని సర్వే నంబర్ 1262, 1266లో రెండు ఎకరాల ఇరువయిన్నర గుంటల భూమిని దేశబోయిన బాలయ్య, దేశబోయిన జగత్‌ప్రకాష్, దేశబోయిన శ్రీనివాస్, దేశబోయిన గోపాల్, దేశబోయిన శ్రీకాంత్ నుంచి కొనుగోలు చేశాడు. ధరణి పోర్టల్‌లో పొరపాటున ఈ నలుగురిపేరిట నాలుగు ఎకరాల భూమికి బదులుగా ఏడు ఎకరాల పద్నాలుగున్నర గుంటల భూమి ఉన్నట్లు తప్పుగా నమోదైంది. దానిని అదునుగా భావించి మోకాపై లేని భూమిని పలువురికి విక్రయించారు. నీరుమళ్ల శ్యామ్‌సుందర్‌కు విక్రయించిన భూమిలోని తొమ్మిది గుంటలను కొండా మురళి అనే వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేశారు. ఇది అన్యాయమనినీరుమల్ల శ్యాం సుందర్ నిలదీయగా 25 లక్షల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. శ్యాం సుందర్ కొన్న భూమిలోంచి ఎకరం రెండు గుంటలను చిట్టుమల్ల శ్రీనివాస్, అతని కుమారుడైన చిట్టుమల్ల అచ్యుత్‌చైతన్య పేరిట రిజిస్ట్రేషన్‌చేయించారు. ఈ విషయంపై శ్యాంసుందర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న చిట్టుమల్ల శ్రీనివాస్ శ్యాంసుందర్‌ను కేసులు ఉపసంహరించుకోవాలని, సమస్యను తాను పరిష్కరిస్తానని చెప్పారు. దీంతో శ్యాంసుందర్ కేసులను ఉపసంహరించుకున్నాడు. తర్వాత పట్టించుకోలేదు. మళ్లీ సమస్యను పరిష్కరిస్తానని 11 గుంటల భూమిని బొల్లినేని సృజన్‌రావుపై రిజిస్ట్రేషన్ చేయించుకుని, అతని నుంచి తిరిగి కొత్త జైపాల్‌రెడ్డికి బదలాయించాడు. మరి కొంత భూమిని పట్టాదారులతో కుమ్మక్కై కొండా మురళి, వంగల సంతోష్, గంప ఫణీంద్రకు రిజిస్ట్రేషన్ చేశాడు. దీంతో నీరుమళ్ల శ్యాంసుందర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు విచారణ జరిపి చిట్టుమల్ల శ్రీనివాస్, చిట్టుమల్ల అచ్యుత్ చైతన్య, గంప రమేష్, కొండా మురళి, వంగల సంతోష్ కుమార్, గంప నాగరాజు, గంప లవకుమార్, , గంప రవళి, వంగల గీత, గంప ఫణీంద్ర, యంసాని రాధా కృష్ణ, ఆకుల సుదర్శన, దేశబోయిన జగత్‌ప్రకాష్, దేశబోయిన. శ్రీనివాస్, దేశబోయిన. గోపాల్, దేశబోయిన శ్రీకాంత్, రేగొండ సందీప్, మాకు వెంకట శారదా దేవి, బొల్లినేని సృజనరావు, కొత్త జయపాల్‌రెడ్డి, దువ్వంతుల లక్ష్మారెడ్డిపై కేసు నమోదు చేశామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.



నిందితులను కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

## యువకుడి ఆత్మహత్య


**- ఉద్యోగం రాలేదన్న మనస్తాపంతో దారుణం**



పవన్(ఫైల్)

కోల్‌సిటీ, ఆగస్టు 30: గోదావరిఖని గంగానగర్‌కు చెందిన దాతు పవన్(25) అనే యువకుడు గురువారం రాత్రి ఇంట్లో ఉరివేసు కుని ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు... రామగుండం నగరపాలక సంస్థ 8వ డివిజన్ కార్పొరేటర్ దాతు శ్రీనివాస్ కుమారుడు పవన్ బీటెక్ పూర్తి చేశాడు. ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలకు ప్రయత్నించాడు. కొన్నిరోజుల పాటు ఉద్యోగం చేసి పవన్ మెరుగైన ఉద్యోగానికి ప్రయత్నించే క్రమంలో ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపానికి గుర య్యాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పవన్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పవన్ తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ భూమేష్ తెలిపారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, మేయర్ బంగి అనిల్ కుమార్, కమిషనర్ శ్రీకాంత్, కార్పొరేటర్లు తదితరులు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

## గుప్త నిధుల కోసం తవ్వకాలు



గోపురానికి రంధ్రం చేసిన దుండగులు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 30: మండలంలోని ముత్తారం గ్రామ పంచాయతీ ధర్మాబాద్‌లో ఉన్న ప్రాచీన కాలం అండాలమ్మ దేవాలయ గోపురాన్ని గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం ధ్వంసం చేశారు. దేవాలయ గోపురానికి రంధ్రం చేసి నిచ్చెన ద్వారా అందు లో గుప్త నిధుల కోసం వెతికి నట్లు ఆనవాళ్లు ఉన్నాయి. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోరుట్ల, ఆగస్టు 30: పట్టణ శివారులోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మెట్‌పల్లి మండల కోనరావుపేట గ్రామానికి చెందిన ఎనుగు గంగారెడ్డి (58) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. మూడు రోజుల క్రితం వాహనాలు ఢీకొన్న సంఘటనలో గంగారెడ్డితో పాటు పశువైద్య కళాశాలకు చెందిన విద్యార్థి తీవ్ర గాయాలు కాగా స్థానికుల సహకారంతో వారిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గంగారెడ్డి గురువారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వేధింపుల కేసులో రెండేళ్ల జైలు

ధర్మారం, ఆగస్టు 30: మండల కేంద్రానికి చెందిన రాగుల మల్లేశం అనే నేరస్తుడికి వేధింపుల కేసులో శుక్రవారం నందిమేడారం కోర్టులో జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎన్ వెంకటసచిన్‌రెడ్డి రెండేళ్ల పాటు జైలు, రూ.6వేలు జరిమానా విధి స్తూ తీర్పు ఇచ్చారు. తేది. 2.12.2015న రాగుల శ్రీలత తన భర్త మల్లేశం మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని తనను వేధిస్తున్నాడని తన అత్త లక్ష్మి, మామ రాజయ్యలు మద్దతు పలుకుతున్నారని ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై లక్ష్మీనారాయణ కేసు నమోదు చేశారు. శుక్రవారం సాక్షులను విచారించిన జడ్జి నేరస్తుడికి జైలు శిక్ష, జరిమానా విధించారు.

# డైలీ ఫైనాన్స్ వ్యాపారులపై పోలీసుల కొరడా

**- సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో దాడులు**

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 30: డైలీ ఫైనాన్స్ వ్యాపారులపై పోలీసులు కొరడా ఝుళిపించారు. శుక్రవారం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో గల డైలీ ఫైనాన్స్, వడ్డీ వ్యాపారస్తుల ఇళ్లు, ఆఫీసుల్లో పోలీసులు దాడులు చేసి విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సిరిసిల్ల టౌన్, వేములవాడ టౌన్, తదితర అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వడ్డీ వ్యాపారస్తులు, డైలీ ఫైనాన్స్ వ్యాపారస్థుల ఇళ్లలో సోదాలు చేశారు. ఈ సోదాల్లో పలు ప్రామిసరీనోట్లు, డాక్యుమెంట్లను, చెక్కులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడారు. జిల్లాలో అనుమతులు లేకుండా డైలీ ఫైనాన్స్ వ్యాపారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సామాన్య ప్రజలను అధిక వడ్డీల పేరిట ఇబ్బందులకు గురిచేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని డబ్బులు ఇచ్చి వారి నుంచి అధిక వడ్డీ రేట్లతో సామాన్యులపై దౌర్జన్యం చేస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చట్టపరమైన పద్ధతులతో ఫైనాన్స్ నిర్వహించే వారిని మాత్రమే ప్రజలు నమ్మాలన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ ఫైనాన్స్ వ్యాపారం నడిపేవారి వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో సమాచారం ఇవ్వాలన్నారు. డయల్ 100కు ఫిర్యాదు చేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు సమగ్ర విచారణ చేసి బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా పోలీసుశాఖ పనిచేస్తుందని ఎస్పీ భరోసా ఇచ్చారు. ఈ మేరకు 16 మందిపై కేసు నమోదు చేసి 8.60లక్షల నగదుతో పాటు 43 బ్లాంక్ చెక్కులు, 36 ప్రామీసరి నోట్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు.



సిరిసిల్లలో వడ్డీ వ్యాపారుల ఇళ్లల్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

**గంభీరావుపేట:** మండల కేంద్రానికి చెందిన గాద గణేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. అవసరం ఉన్న వారికి డబ్బు ఇస్తూ అధిక వడ్డీ వసూలు చేస్తున్నాడనే ఫిర్యాదు మేరకు గాద గణేశ్ ఇంటిలో శుక్రవారం పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెండు ఖాళీ చెక్కులు, 15 ప్రామిసరీ నోట్లు, ఓ వర్జినల్ ఆర్సీ పేపర్ లభించాయి. దీంతో గాద గణేష్‌పై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని ఎస్ఐ తెలిపారు.

## రేపు పద్మనాయక వెలమ సంఘం వార్షిక సమావేశం

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 30: కరీంనగర్ పద్మనాయక వెలమ సంఘం వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం పద్మనాయక వెలమ సంఘం కల్యాణమండపం-2లో నిర్వహిస్తున్నామని ఆ సంఘం ప్రధానకార్యదర్శి చీటి ప్రకాశ్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సర్వసభ్య సమావేశానికి సభ్యులందరూ హాజరుకావాలని కోరారు. సమావేశంలో 2023-2024 వరకు అకౌంట్స్ పరిశీలించనున్నట్లు తెలిపారు. బాలికల వసతి గృహంలో పనులు, కల్యాణమంటపంను ఏసీహాల్‌గా మార్చటం, వృద్ధాశ్రమంలో పనుల గురించి చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

## నేడు నగరంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్,ఆగస్టు 30: నగరంలో విద్యుత్ కొత్త లైన్ పనుల్లో భాగంగా శనివారం ఉదయం 9:30 నుంచి 11:30 వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు, ఏడిఈ, సుధీర్ కుమార్ తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేయు ప్రాంతాలు మంకమ్మతోట, పొన్నం కాంప్లెక్స్, శ్రీరామ బుక్ స్టాల్ ఏరియా, వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

## నేడు నశా ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమం

సుభాష్‌నగర్, ఆగస్టు 30: ప్రజాపతి బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 31న నశా ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బికె మనీషా, కరీంనగర్ సంచాలకులు బికె విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వ్యసనాలు, వాటి దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. నగరంలోని కిమ్స్ డిగ్రీ కాలేజీలో నిర్వహించే ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఆయనతోపాటు జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి, ఎక్సైజ్ సూపరింటెండెంట్, మహిళ శిశు సంక్షేమ అధికారి తెలిపారు.

## పోటీ పరీక్షల కోసం పుస్తకాలు అందజేత

గణేశ్‌నగర్,ఆగస్టు 30: యువతలో నైపుణ్యానికి బిఎస్‌రావు ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపల్ డా.వై.సత్యనారాయణ కొనియాడారు. శుక్రవారం ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాలలోని గ్రంథాలయానికి రూ.20వేల విలువ చేసే వివిధ పోటీ పరీక్షల పుస్తకాలను డాక్టర్ బి.ఎస్.రావు కళాశాల ప్రిన్సిపల్‌కు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బీఎస్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో కోట్లాది ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయని అందుకు కారణం యువతలో నైపుణ్యాలు కొరవడటమే అన్నారు. విద్యా విధానాన్ని , కరికులంను మార్చాలని అన్నారు. ఇంటర్ స్థాయి నుంచే అప్రెంటిస్ విధానాన్ని ప్రవేశ పెట్టాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.రాజయ్య, డాక్టర్ అలీం, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బి.శ్రీనివాస్, ఎస్సారార్ కళాశాల గ్రంథపాలకులు జి. కృష్ణారెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబరు 2న బొవేరా జయంతి

● స్మారకోపన్యాసం చేయనున్న జేడీ లక్ష్మీనారాయణ

● హాజరు కానున్న మంత్రి పొన్నం, కోదండరాం, అందెశ్రీ



మాట్లాడుతున్న బోయినపల్లి హనుమంతరావు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 30: జిల్లాకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సమసమాజ స్వాప్నికుడు, విశ్వబంధు డాక్టర్ బోయినపల్లి వేంకట రామారావు 104వ జయంతిని సెప్టెంబరు 2న మధ్యాహ్నం 3 గంటల నుంచి ముఖరంపురలోని పద్మనాయక కల్యాణమండపం హాల్ నెం-2లో నిర్వహించనున్నట్లు బొవేరా సంస్థల అధ్యక్షుడు బోయినపల్లి హనుమంతరావు తెలిపారు. శుక్రవారం బొవేరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మాజీ సీబీఐ అధికారి, సామాజికవేత్త, యువత వ్యక్తిత్వ నిర్మాణ మార్గదర్శకుడు జెడి లక్ష్మీనారాయణ బొవేరా స్మారకోపన్యాసం చేస్తారని, ప్రజా యుద్ధ నౌక, వాగ్గేయకారుడు గద్దర్‌కు మరణానంతరం ఆయన సతీమణి విమలా గద్దర్‌కు, తనయుడు సూర్యకిరణ్‌కు బొవేరా కవితా పురస్కారం ప్రదానం చేయనున్నామని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్, మరో అతిథిగా ఎంఎల్‌సి, విద్యావేత్త ప్రొఫెసర్ కోదండరాం, మరో అతిథిగా, పురస్కార ప్రదాతగా రాష్ట్రగీత కర్త, కవి అందెశ్రీ, ఇతర అతిథులుగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మేయర్ యాదగిరి సునీల్‌రావు హాజరౌతున్నారని తెలి పారు. రాష్ట్ర తొలి స్పీకర్, ఎంఎల్‌సి ఎస్ మధుసూదనాచారి అధ్యక్షత వహి స్తారని తెలిపారు. కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధులు, వారి వారసులు, సాహితీవేత్తలు, కవులు, రచయితలు, బొవేరా అభిమానులు, విద్యార్థులు, నగర వాసులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## డబుల్ రోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న బండి సంజయ్

గన్నేరువరం, ఆగస్టు 30: మండల కేంద్రం నుంచి మైలారం మీదుగా ఖాసింపేట, వడ్లూరు, బేగంపేట వరకు 32కోట్ల వ్యయంతో నిర్మించనున్న డబుల్ రోడ్డు పనులను కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి శుక్రవారం మండల కేంద్రంలో ప్రారంభించారు. తొలిసా రిగా కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ మండల కేంద్రానికి రావడంతో బీజేపీ మండల శ్రేణులు ఎంపీకి, కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు ఘనస్వాగతం పలికారు. క్రేన్ సహాయంతో గజమాలను వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నగునూరి శంకర్, తిప్పర్తి నిఖేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, బొడ్డు సునీల్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే మేడిపల్లి



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి, ఆగస్టు 30: పట్టణ పరిధిలోని ఒకటో వార్డులో మూడు లక్షల రూపాయలతో నిర్మించిన డ్రైనేజీ పనులతో పాటు మున్సిపల్ కార్యాలయంలో 12లక్షల విలువ గల మినరల్ వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలో ఆయన 57 లక్షల రూపాయల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను 237 మంది లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్‌కుమార్, మున్సి పల్ కమిషనర్ నాగరాజు. ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**రామడుగు:** మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ కింద దరఖాస్తు చేసుకున్న 284 మందికి ఎమ్మె ల్యే మేడిపల్లి సత్యం చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటలక్ష్మీ, ఎంపీడీవో రాజేశ్వరి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్న, మాజీ ఎంపీపీ వీర్ల నర్సింగరావు, హరీష్, గోపాల్, తిరుపతి, పంజాల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

# పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 30: పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రధానోపాధ్యాయుల సన్నద్ధత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించడం కోసం ప్రధానోపాధ్యాయులు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. సమయానికి ముందే సిలబస్ పూర్తి చేసి రివిజన్ చేయించాలన్నారు. పాఠశాలలో ఆహ్లాదకరమైన స్నేహపూర్వకమైన వాతావరణంలో విద్యను బోధించాలన్నారు. కొన్ని పాఠశాలల్లో డైనింగ్ టేబుల్‌లను ఉపయోగించడం లేదని, లైబ్రరీని స్టోర్ రూంగా మార్చారన్నారు. వీటిని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. జిల్లాలో 23,316 మంది విద్యార్థులకు బూట్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి ఎల్పీజీ ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొంత మంది విద్యార్థులు తెలుగు సబ్జెక్టులో ఫెయిల్ అవుతున్నారని, మాతృభాషలో ఫెయిల్ కాకుండా చూడాలన్నారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం పాఠశాలలకు ఇచ్చిన సౌకర్యాలను తప్పకుండా వినియోగించుకోవాలని కోరారు. పాఠశాలల్లో డ్రగ్స్ నిర్మూలన బాధ్యత ప్రధానోపాధ్యాయులపై ఉందన్నారు. కనీస సౌకర్యాల సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఈఓ జనార్ధన్, ఎగ్జామినేషన్ బాధ్యులు స్వామి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మానసిక వికలాంగులకు పండ్ల పంపిణీ

కరీంనగర్‌టౌన్, ఆగస్టు 30: చెర్మాల వెంకటేశ్వర్లు పుట్టినరోజు సందర్భంగా 137 డిస్ట్రిక్ గవర్నర్, అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉజ్వల పార్క్‌సమీపంలోని మనోవికాస ప్రత్యేక పాఠశాలలో మానసిక వికలాంగుల కోసం ప్రత్యేకంగా ఆహారం, బిస్కెట్లు , పండ్లు పంపిణీ చేశారు.డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ చెర్మాల వెంకటేశ్వర్లు పుట్టినరోజును ఇలా జరపడం ఎంతో సంతోషకరమని పలువురు పేర్కొన్నారు. అలయన్స్ క్లబ్స్ తమ నాయకుల పుట్టినరోజులను,పెళ్లిరోజులను వీరితో జరుపుకోవడం ఆనవాయితీగా చేస్తామని ఆయన అన్నారు. ఇక్కడి పిల్లలతో పుట్టినరోజు జరుపుకోవడం సంతోషంగా ఉందని చెర్మాల వెంకటేశ్వర్లు అన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన వారిని ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ వేడుకలో డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, ఇంజనీర్ కోలా అన్నారెడ్డి, ఇ. కుమారస్వామి, గాలిపల్లి నాగేశ్వర్, చెర్మాల పల్లవి, చీకోటి శ్రీనివాస్ గాంధీ, కొంజర్ల మహేష్, పులాల శ్యామ్, ఎస్.ఎల్.ఎస్.వి.ఎం ప్రసాద్, పండుగ నగరాజు ఉన్నారు.

## అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో కామర్స్ క్లబ్



కామర్స్ క్లబ్ లోగోను ఆవిష్కరిస్తున్న రవీందర్‌రెడ్డి

భగత్‌నగర్, ఆగస్టు 30: నగరంలోని ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం కామర్స్ క్లబ్-2024ను శాతవాహన యూనివర్సిటీ కామర్స్ విభాగాధిపతి డాక్టర్ డి హరికాంత్, కళాశాల కరస్పాండెంట్ వి రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరికాంత్ మాట్లాడుతూ కామర్స్ క్లబ్ నిర్వహణ విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి ఆర్థిక అక్షరాస్యతను అందిస్తుందన్నారు. అల్ఫోర్స్ కళాశాలలో ఈ విధమైన క్లబ్ ఏర్పాటు చేయడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అల్ఫోర్స్ కళాశాల కరస్పాండెంట్ వి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కామర్స్ రంగంలో ఉన్న వివిధ పరిశోధనలు, ఆర్థిక రంగంలో కామర్స్ యొక్క పాత్రను వివరిస్తూ తమ విద్యార్థినిలు ఉద్యోగ సృష్టికర్తలుగా, వ్యాపార వ్యవస్థాపకులుగా రాణించడానికి కామర్స్ క్లబ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కామర్స్ అధ్యాపక బృందం, నూతన అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్‌లో సెయింట్ జార్జ్ విద్యార్థుల అత్యుత్తమ ప్రదర్శన



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ ఫాతిమారెడ్డి

భగత్‌నగర్, ఆగస్టు 30: నగరంలోని సెయింట్ జార్జ్ (సీబీఎస్ఈ) ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు క్రికెట్ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. శుక్రవారం పాఠశాల ఆవరణతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సెయింట్ జార్జ్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ సైడ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రిజిష్టర్ అండర్ సొసైటీ రిజిస్ట్రేషన్ యాక్ట్ 1860 వారిచే నిర్వహించిన 2వ నేషనల్ క్రికెట్ చాంపియన్ షిప్ 2024లో పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మహిమాన్విత్, ధృవ సునీల్, సాత్వికొరెడ్డి, హర్షవర్ధన్, పార్థుకార్తికేయ, శ్రీనాథ్, రితీష్‌లను అభినందించారు. ఈ సందర్భంగా క్రికెట్ కోచ్ సాయి నాథ్, విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 30: సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కిసాన్‌జాగరణ్ అధ్యక్షుడు పి సుగుణాకర్‌రావు అన్నారు. శుక్రవారం నగరంలోని కృషి భవన్‌లో కిసాన్ జాగరణ్ ఆధ్వర్యంలో ప్రగతిశీల రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ భూ సంరక్షణ, ఆరోగ్యానికి సేంద్రీయ వ్యవసాయ ప్రోత్సహించే అవసరం ఉందన్నారు. సేంద్రీయ వ్యవసాయ ఎరువుల వాడకం వలన ఉత్పత్తి వ్యయం తక్కువ ఉంటుందని, ప్రత్యేకంగా కొన్ని రసాయన ఎరువుల కంటే బాగా పనిచేస్తుందన్నారు. ఈ సమావేశంలో అశ్విని హోమియో, అయుర్వేదిక్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత అశ్విని సుబ్బారావు, డైరెక్టర్ మహేశ్వరి, ప్రగతి శీల రైతులు, రైతు ఉత్పత్తి దారుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా సీతారాముల కల్యాణం

● శ్రీరాంనగర్ కాలనీలో ముగిసిన ప్రతిష్ఠోత్సవాలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 30: నగరంలోని శాతవాహన యూనివర్సిటీ సమీపంలో శ్రీరామనగర్ కాలనీ, రోడ్ నెం-7లో ఆలయ కమిటీ, శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన శ్రీసీతారామచంద్రస్వామి మందిర ప్రతిష్ఠ కార్యక్రమాలు శుక్రవారంతో ఘనంగా ముగిసాయి. వేదపండితుడు, యజ్ఞాచార్యుడు గోవర్ధనగిరి జగన్నాథాచార్యుల బృందం ఆధ్వర్యంలో ఉదయం షోడశ కళాన్యాసము, దృష్టి కుంభము, అలంకారము, ప్రథమారాధన జరిగాయి. అనంతరం సీతారామ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. దంపతుల క్షేమం కోసం ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష కార్యదర్శులు డి మాధవరావు, గజవాడ అంజనేయులు, కోశాధికారి ఎస్ నరసింహాచారి, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమానికి పెద్దపీట

- మండలంలో 8వేల మందికి రుణమాఫీ
- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మానకొండూర్, ఆగస్టు 30: రైతు సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తోందని డిసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్ మార్కెట్ కమిటి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలోని రైతులందరికీ రెండు లక్షల వరకు రుణమాఫీ చేసి దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. మండలంలో 8వేల మందికి రూ.55కోట్ల రుణమాఫీ అయినట్లు చెప్పారు. దీంతో రైతులు సంబరాలు చేసుకుంటే ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని అన్నారు. సాంకేతిక కారణాల వల్ల ఆగిపోయిన 1,800 మంది రైతులకు కచ్చితంగా రుణమాఫీ చేస్తామని చెప్పారు. బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ అసత్య ఆరోపణలతో ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారానే అన్ని ప్రాజెక్టులకు నీరు అందనుందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి మిడ్‌మానేరు, అంతగిరి, రంగనాయకసాగర్ ఎల్ఎండీలోకి నెల రోజులలోనే 20 టీఎంసీల నీరును సరఫరా చేశామని తెలిపారు. నూతన పాలకవర్గం రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని ఆయన సూచించారు. అంతకు ముందు చెరువు కట్ట బస్టాండ్ నుంచి మార్కెట్ కార్యాలయం వరకు కార్యకర్తలు, రైతులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పల్లెమీద బస్టాండ్ వద్ద క్రేన్ సా యంతో భారీ గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షుడు మర్రి ఓదెలు, ఉపాధ్యక్షుడు రామిడి తిరుమల్‌రెడ్డి, మార్కెటింగ్ శాఖ అధికారి ప్రకాష్, తహసీల్దార్ రాజేశ్వరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి, డీసీ ప్రధాన కార్యదర్శి తాల్లపల్లి సంపత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**శంకరపట్నం:** విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే విద్యతో క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 68వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి పాఠశాలల క్రీడోత్సవాలలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, తహసీల్థార్ భాస్కర్, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## 12 టీఎంసీలకు చేరిన నీటిమట్టం

తిమ్మాపూర్, ఆగస్టు30: కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం నీటి మట్టం శనివారం 12టీఎంసీలకు చేరుకుంది. ఎల్ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.036 టీఎంసీలు కాగా ప్రస్తుతం 12.107 టీఎంసీలకు చేరుకున్నది. ఎంఎంఆర్ నుంచి 14,600 క్యూసెక్కులు, మోయతుమ్మెద వాగు నుంచి 250 క్యూసెక్కుల నీరు చేరుతోంది. 14,850 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉందని, అవుట్ ఫ్లో 250క్యూసెక్కులు ఉందని, ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

## కొనసాగుతున్న నీటి విడుదల

రామడుగు, ఆగస్టు 30: లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదల కొనసాగుతోంది. శుక్రవారం మూడు పంపుల ద్వారా 9,450 క్యూసెక్కుల నీటిని ఎస్ఆర్ఆర్ డ్యామ్‌కు తరలించారు. ఇప్పటి వరకు గాయత్రి పంప్ హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 23 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు.

## వావిలాలలో వైద్య శిబిరం

జమ్మికుంట రూరల్, ఆగస్టు 30: వావిలాలలో ప్రభుత్వ యునాని వైద్యశాల ఆధ్వర్యంలో వృద్ధులకు శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆబాది జమ్మికుంటలో డాక్టర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, 52మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మడిపల్లిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో డాక్టర్ సంధ్య ఆధ్వర్యంలో 54మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమాల్లో జిల్లా ప్రోగ్రాం అధికారి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడొద్దు

శంకరపట్నం, ఆగస్టు 30: విద్యార్థులు, యువకులు మత్తు పదార్థాల బారిన పడి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. మండలంలోని తాడికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాదకద్రవ్యాలు, సైబర్‌క్రైమ్స్‌పై ఏసీపీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌జీ మాట్లాడుతూ డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులాగానే ఇప్పుడు మాదకద్రవ్యాలు సేవించిన వారిని గుర్తించడానికి డ్రగ్ కిట్స్ వచ్చాయన్నారు. టెస్టులో నిర్ధారణ అయితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఆన్‌లైన్, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటీపీలు, బ్యాంకు వివరాలకు అపరిచితులకు తెలుపకూడదని సూచించారు. కార్యక్రమంలో హుజూరాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్, ఎస్సై రవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉద్యోగాల కల్పనే ధ్యేయం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ సాగర్‌రావు

తిమ్మాపూర్, ఆగస్టు30: విద్యార్థులకు ఉద్యోగాల కల్పనే ధ్యేయమని జ్యోతిష్మతి విద్యా సంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు అన్నారు. జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ విభాగాన్ని శుక్రవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సాగర్‌రావు మాట్లాడుతూ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులకు ఉపయోగ పడుతుందని చెప్పారు. సాప్ ల్యాబ్స్ ఇండియా ఆధ్వర్యంలో కోడ్ ఉన్నతి ప్రోగ్రాం, ఎడ్యునేట్ ఫౌండేషన్ టాస్క్ నేతృత్వంలో విద్యార్థులకు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతపై శిక్షణ ఇవ్వడానికి ఈ విభాగాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంలో టాస్క్, ఐటీ, ఈ అండ్ సి విభాగంలో విధులు నిర్వహిస్తున్న ప్రదీప్ రెడ్డి పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఎడ్యునెట్ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ మహ్మద్ అఫ్సర్ పాషా మాట్లాడుతూ ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవా లని సూచించారు. కార్యక్రమంలో జ్యోతిష్మతి విద్యా సంస్థల సెక్రటరీ, కరస్పాం డెంట్ జువ్వాడి సుమిత్‌సాయి, టాస్క్ డిస్ట్రిక్ట్ రిలేషన్‌షిప్ మేనేజర్ గంగాప్రసాద్, క్లస్టర్ మేనేజర్ సుధీర్, ప్రిన్సిపాల్ కేఎస్‌రావు, డీన్ వైశాలి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన చర్మకారుల సంఘం సభ్యులు

జమ్మికుంట రూరల్, ఆగస్టు 30: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను హైదరాబాద్‌లో చర్మకారుల సంఘం నాయకులు శుక్రవారం కలిసి హైడ్రా కూల్చివేతల సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. గచ్చిబౌలిలోని లిడ్ క్యాప్ టీజీఎల్ఐపీసీ అక్రమ కట్టడాలను హైడ్రా కూల్చి వేయడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇండస్ట్రియల్ మినిస్టర్ శ్రీధర్‌బాబు, లిడ్ క్యాప్ టీజీఎల్ఐపీసీ ఎండి శ్రీనివాసనాయక్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చిట్యాల మొగిలి, నాగరాజు, కన్వీనర్ కూసపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నేడు వేలం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 30: నగరంలోని జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయంలో 2024-25 సంవత్సరానికి పూజాసామగ్రి అమ్మకం, కొబ్బరి ముక్కల పోగుకు వేలం శనివారం ఉదయం 10 గంటల నుంచి ఆలయంలో నిర్వహిస్తున్నట్లు ఈఓ నాగారపు శ్రీనివాస్ తెలిపారు.

## శ్రావణ శుక్రవార పూజలు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 30: నగరంలోని ఆలయాల్లో శ్రావణమాస చివరి శుక్రవార పూజలను ఘనంగా నిర్వహించారు. పాత బజార్ గౌరీ శంకర, అశోక్‌నగర్ మళయాళ సద్గురు గీతా మందిరం, వాసవి కన్యకాపరమేశ్వరి, చైతన్యపురి మహాశక్తి, జ్యోతి నగర్ హనుమాన్ సంతోషిమాత, యజ్ఞవరాహక్షేత్రంలోని మహాలక్ష్మీ, బొమ్మకల్‌రోడ్ అంబా భవానీ, కమాన్‌రోడ్ రామేశ్వర, భాగ్యనగర్ సంతోషిమాత, వావిలాలపల్లి హనుమత్ సహిత కనక దుర్గ ఆలయాల్లో జరిగిన పూజల్లో మహిళలు పాల్గొన్నారు.

## ఎమర్జెన్సీ సినిమాను బ్యాన్ చేయాలి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 30 : ఎంపీ కంగనా రనౌత్ దర్శకత్వం వహించి నిర్మించిన ఎమర్జెన్సీ సినిమా సిక్కుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉందని సిటీ కాంగ్రెస్ అధికార ప్రతినిధి సర్దార్ దన్నసింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ టౌన్ ఏసీపీ జి నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సినిమాలో అనేక సిక్కు వ్యతిరేక దృశ్యాలు ఉన్నాయని, ఈ సినిమా బ్యాన్ చేయాల్సిందిగా ఏసీపీని కోరారు. కార్యక్రమంలో అబ్దుల్ రెహమాన్, కిషన్‌సింగ్, ఆమేర్, జీవన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

గణేశ్‌నగర్,ఆగస్టు 30: లోవోల్టేజీ సమస్య పరిష్కరించడానికి బ్యాంక్ కాలనీ సబ్‌స్టేషన్‌లో దాదాపు రూ.1.28 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ఎస్ఈ గంగాధర్ ప్రారంభించారు. అంబేద్కర్‌నగర్, స్టేడియం గ్రౌండ్‌లో కొత్త సబ్‌స్టేషన్ శాంక్షన్ అయినట్లు ఎస్ఈ తెలిపారు. కొత్త సబ్‌స్టేషన్ ప్రతి పాదనలు మార్క్‌ఫెడ్, బొమ్మకల్, గీతాభవన్, కొత్తపెల్లి మెడికల్ కాలేజీ కోసం ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు.

## ఈశ్వరగారి ముక్తేశ్వరి ఫౌండేషన్ సాహితీ అవార్డుకు సంపత్ ఎంపిక

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 30: వేములవాడకు చెందిన ఈశ్వరగారి ముక్తేశ్వరి ఫౌండేషన్ సాహితీ 2023-అవార్డుకు జిల్లాకు చెందిన యోగాచార్య ఎస్ సంపత్‌కుమార్ ఎంపికైనట్లు ఫౌండేషన్ చైర్మన్ ఈశ్వరగారి నరహరిశర్మ తెలిపారు. సంపత్ రాసిన యోగః సర్వవ్యాధి నివారకః అనే గ్రంధానికి పురస్కారం ఇవ్వనున్నట్లు, పురస్కారం కింద రూపాయలు 5,116తో సన్మానం చేయనున్నట్లు పేర్కొన్నారు. అవార్డును సెప్టెంబరు చివరివారంలో అందజేస్తామని తెలిపారు. సంపత్ అవార్డుకు ఎంపిక కావడం పట్ల జిల్లావాసులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## ఉల్లంపల్లిలో ఉచిత వైద్య శిబిరం

చిగురుమామిడి, ఆగస్టు 30: చిగురుమామిడి మండలంలోని ఉల్లంపల్లిలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ధనలక్ష్మి, స్వరూప పాల్గొన్నారు.

## ● సంక్షిప్త సమాచారం..

● చొప్పదండి: మండల స్థాయి ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీలు చొప్పదండిలో శుక్రవారం ప్రారంభ మయ్యాయి. అండర్-14. అండర్-17, విభాగంలో బాలురకు క్రీడల ఎంపిక పోటలను ప్రారంభించినట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కొమురోజు కృష్ణ తెలిపారు.

● తిమ్మాపూర్: మండలంలోని కొత్తపల్లి మాజీ సర్పంచ్ ఇనుకొండ జితేందర్‌రెడ్డి తండ్రి ఇనుకొండ వెంకట్రామిరెడ్డి ఇటీవత మృతి చెందగా శుక్రవారం బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణరావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, నాయకులు అశోక్‌రెడ్డి ఉన్నారు.

● వీణవంక: మండల కేంద్రానికి చెందిన రాజవీరు అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని శుక్రవారం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పరా మర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

● గంగాధర మండల స్థాయిఎస్ జీఎఫ్ క్రీడలను మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బాబు శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రక టనలో తెలిపారు. మంగళవారం అండర్-14,17 బాల బా లురకు కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. బుధవారం అండర్-14,17 బాలికలకు కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్ క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇస్లాంపూర్ రహదారిపై రోడ్డుపై ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను శుక్రవారం యువకులు తొలగించారు. కరీంనగర్, జగిత్యాల ప్రధాన రహదారిపై మర్రి చెట్లు వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో మాజీ సర్పంచ్ వడ్లూరి అనితాఆ దిమల్లు దృష్టికి తీసుకువచ్చారు.

గణేశ్ ఉత్సవకమిటీలు పోలీ సుల అనుమతి తీసుకోవాలని ఎస్ఐ కిరణ్‌రెడ్డి తెలిపారు. వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించే ఉత్సవ కమిటీ పోలీస్ శాఖ లింకులో నమోదు చేసుకోవాలని సూచించారు.

● సైదాపూర్: మండలంలోని పలు గ్రామాలలో వ్యవసా యాధికారులు రెండు లక్షల లోపు రుణమాఫీ కానీ రైతుల వివరాలను సేకరిస్తున్నారు. వారి వద్ద నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నారు.

● ఇల్లందకుంట: రైతులు సాగుచేసే పంటల వివరాలను వ్యవసాయ శాఖ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి సూచించారు. మండలంలోని వంతడుపులలో రైతులు వేసిన పత్తి, వరి పంటలను శుక్రవారం పరిశీలించారు.

● హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్‌లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శ్రమదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ రజిత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గొబ్బెట తిరుపతి పాల్గొన్నారు.

● హుజూరాబాద్ పర్యావరణ పరిరక్షణ కోసం వినాయక చవితి వేళ మట్టి గణపతులను ప్రతిష్ఠించాలని పర్యావరణ ప్రేమికుడు, సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్ ఒక ప్రకటనలో కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన గణపతులను నిమజ్జనం చేయడం ద్వారా నీరు కలుషితంగా మారుతుందని తెలిపారు.

● జమ్మికుంట: పెసరుబండ ప్రభుత్వ స్థలంలో ఉందని, కొందరు వ్యక్తులు సర్వే నంబర్లు మార్చి ఆక్రమించారని తహసీల్దార్ కార్యాలయం ఎదుట పట్టణానికి చెందిన మహేందర్, అక్బర్‌పాష శుక్రవారం దీక్ష చేపట్టారు. అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.